సాక్షి నంద్యాల

బుధవారం : 20 : నవంబర్ : 2024



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో శనగల బసవన్న నందీశ్వరునికి, క్షేత్రపాలకుడి బయలు వీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు, అధికారులు విశేషపూజలు నిర్వహించారు.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం విశాఖపట్నంకు చెందిన కె.సునీత బృందం భక్తి గీతాలకు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.77
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 96.891
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 4,076
అవుట్ ఫ్లో	: 6,929

న్యూస్‌రీల్

శ్రీశైలానికి 4,479 క్యూసెక్కుల వరద ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయానికి ఎగువ సుంకేసుల నుంచి మంగళవారం సాయంత్రం సమయానికి 4,479 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. ప్రస్తుతం జలాశయంలో 160.9100 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 874.40 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు సుంకేసుల నుంచి శ్రీశైలానికి 3,226 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 16,483 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.127 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

పదిలో 100 శాతం ఫలితాలు సాధించాలి



మొక్క నాటుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్):పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం ఆయన ఎంఈఓ బ్రహ్మంనాయక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే చదువు పూర్తిస్థాయిలో అబ్బుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలను మించి ఫలితాలు సాధించాలన్నారు. ఇందుకు ఇప్పటి నుంచి ఉపాధ్యాయులు ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

నంద్యాల(రూరల్): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. డిసెంబర్ 23, 30 తేదీల్లో మచిలీపట్నం – కొల్లం (రైలు నెంబర్ 07147, 07148) వయా నంద్యాల మీదుగా ప్రత్యేక రైలు వెళ్తుంది. ఆయా తేదీల్లో రైలు రాత్రి 8.45 గంటలకు నంద్యాలకు చేరుకొని, కొల్లంకు మరుసటి రోజు రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుందని, అదేవిధంగా కొల్లంలో డిసెంబర్ 25, జనవరి 1 తేదీన ఉదయాన్నే 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 2.30 గంటలకు నంద్యాలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎంపీ శబరి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

సాంకేతికతను మంచికే వినియోగించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను విద్యార్థులు సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా సూచించారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో రాజీవ్ గాంధీ మెమోరియల్ ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులతో సమావేశమయ్యారు. సైబర్ నేరాలు, సాంకేతికత వినియోగం, వివాదాస్పద వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చుల్లో పడి మోసపోతున్నారన్నారు. వారి ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. ప్రసారమాధ్యమాల ద్వారా వచ్చే సమాచారాన్ని అనాలోచితంగా ఇతరులతో పంచుకోరాదన్నారు. సైబర్ నేరాలకు పాల్పడితే విధించే శిక్షలు, తదనంతర పరిణామాలను వివరించారు. స్త్రీల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా పోలీసుల సహాయం కోసం 100, 112 నంబర్లకు, సైబర్ నేరాలతో మోసపోతే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ గాయత్రి, ఉపాధ్యాయులు సర్ఫరాజ్, అనిత, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

- ప్రారంభమై 8 నెలలైనా మొదలుకాని సేవలు
- రూ. కోట్ల విలువైన యంత్రాలున్నా అనుమతులు తెచ్చుకోలేని వైనం
- 120 పడకల ఆసుపత్రిలో ఒక్కటీ కూడా రాలేదు
- రోజుకు ఓపీ 10 నుంచి 15 దాటని వైనం
- గత ప్రభుత్వం నిర్మించిందనే కారణంతో కూటమి ప్రభుత్వం జాప్యం



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం

ఆశయం ఘనం.. సేవలు గగనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అక్కసో.. పేదలంటే అలుసో తెలియదు కానీ కూటమి ప్రభుత్వం వైద్య సేవలను విస్మరిస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో ఆర్భాటంగా ప్రారంభించిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఇప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతోంది. భవనం ఉన్నా అవసరమైన పరికరాలు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు ప్రైవేటు బాట పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డాక్టర్లు ఓపీలో కూర్చుంటున్నా పట్టుమని పది మంది కూడా రోగులు చికిత్స కోసం రావడం లేదు. మంజూరైన పోస్టుల్లో 30 శాతం కూడా పోస్టులు భర్తీ చేయకపోవడం, ఉన్న వారికి పనిలేకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతుంది.



సీటీ స్టిమ్యులేషన్ మిషన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు 2017లో అంకురార్పణ జరిగింది. రూ.120 కోట్ల అంచనాతో నిర్మించిన ఈ ఆసుపత్రికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.50 కోట్లను విడుదల చేసింది. 2018లో టాటా ట్రస్ట్ వారు వచ్చి స్థలాన్ని పరిశీలించి బిల్డింగ్ ప్లాన్ ఇచ్చి వెళ్లింది. రాష్ట్ర వాటా కింద రూ.36 కోట్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆసుపత్రిలో రెండు లీనియర్ యాక్సిలరేటరీలు, ఒక సీటీ సిమ్యులేటర్, ఒక హైడోస్ రేట్ బ్రాకోథెరపీ మిషన్ల ఏర్పాటుకు అవసరమైన నాలుగు బంకర్ల నిర్మాణానికి అప్పట్లో టాటా అటానమిక్ ఎనర్జీ వారు అనుమతులు మంజూరు చేశారు. ఇందులో ప్రస్తుతం హెచ్‌డీఆర్ బ్రాకోథెరపీ మిషన్ మాత్రం రావాల్సి ఉంది. రూ.30కోట్లతో లీనియర్ యాక్సిలరేటరీ, రూ.10కోట్లతో సీటీ స్టిమ్యులేటర్ ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు సంబంధించి టాటా అటానమిక్ ఎనర్జీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. 2019 జనవరిలో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేసినా ఆ తర్వాత ప్రభుత్వం మారడం, కోవిడ్ రావడం, ఇసుక కొరత తదితర కారణాల వల్ల భవన నిర్మాణం ప్రారంభం కాలేదు. ఇదే క్రమంలో 2022లో క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ ఎండీ పీజీ సీటును నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అప్పట్లో ఆగిపోయిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి పనులు ప్రారంభమయ్యేలా చేసింది. ఈ క్రమంలో గత మార్చి నెలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమయ్యింది.



లీనియర్ యాక్సిలిరేటర్ మిషన్

ఓపీకి 10 మంది మాత్రమే రోగులు

రాష్ట్ర వ్యాప్తంగా పేరెన్నికగన్న ఆసుపత్రి అవుతుందని ప్రారంభ సమయంలో అందరూ భావించారు. ఆ వెంటనే ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించి, ప్రారంభించిందనే కారణంతో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడంలో తాత్సారం చేస్తోంది. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు కాకపోవడం, వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం వల్ల ఇక్కడకు రోగులు సైతం ఓపీకి రావడం లేదు. ఈ మేరకు అధికారులు, వైద్యులు సైతం ధైర్యంగా ఇక్కడ అత్యాధునిక సేవలు అందుతాయన్న భరోసా కల్పించలేకపోతున్నారు. ఇందులో అదనంగా లీనియర్ ఆక్సలరేటర్, ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, సీటీ స్కాన్‌లు, పలు రకాల పరికరాలు రావాల్సి ఉంది.

మంజూరైంది 247... భర్తీ చేసింది 60 మందిని మాత్రమే

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు గత ప్రభుత్వం 247 పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. కానీ ఇప్పటి వరకు పోస్టులు భర్తీ చేయలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలన్న ప్రయత్నాలు చేస్తోంది. ఈ కారణంగా ఆయా విభాగాలు, ఇతర ఆసుపత్రుల నుంచి 60 మంది వైద్యులు, సిబ్బంది మాత్రం ఇక్కడకు వచ్చి చేరారు. ప్రస్తుతం ఇద్దరు సర్జికల్ ఆంకాలజిస్టులు, ఒక మెడికల్ ఆంకాలజిస్టు, రేడియేషన్ ఆంకాలజీలో ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరితో పాటు ఇద్దరు పెథాలజిస్టులు, ఇద్దరు సైకియాట్రిస్ట్‌లు ఇక్కడ సేవలందిస్తున్నారు. ప్రివెంటివ్ ఆంకాలజీ ఓపీ సైతం ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహిస్తున్నారు. కానీ రోగులే ఎవ్వరూ రావడం లేదు.

120 పడకల్లో ఒక్కటీ రాలేదు

120 పడకలతో ఏర్పాటైన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఇప్పటి దాకా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పడక కూడా ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా పాత క్యాన్సర్ విభాగంలోనే అవసరమైన అడ్మిషన్లు చేస్తున్నారు. రోగులకు అవసరమైన ఆపరేషన్లు కూడా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రతి నెలా 15 మేజర్, 8 మైనర్ క్యాన్సర్ ఆపరేషన్లను వైద్యులు చేస్తున్నారు. క్యాన్సర్ విభాగంలో 8 ఐసీయూ పడకలు ఏర్పాటు చేసినా అవి అందుబాటులోకి రాలేదు. 9 ఎకరాల్లో నిర్మితమైన ఇంత పెద్ద భవనానికి కనీసం సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది కూడా కేటాయించలేదు. ఈ కారణంగా ఖరీదైన పరికరాలున్న ఈ భవనానికి రక్షణ లేకుండా పోయింది. అవసరమైన వైద్యులు, పారా మెడికల్, నర్సింగ్ సిబ్బందిని, నాల్గవ తరగతి ఉద్యోగులను నియమించి, తగిన పరికరాలను, పడకలను అందుబాటులోకి వస్తే రాయలసీమ ప్రజలకు నాణ్యమైన క్యాన్సర్ వైద్యసేవలు అందించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

త్వరగా పూర్తిస్థాయి సేవలందించాలి



కర్నూలు నగరంలో రాష్ట్రస్థాయి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు కావడం ఎంతో ఆనందకరం. ఇలాంటి ఆసుపత్రి సేవలను ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత సమాజంలో మారిన జీవనశైలి కారణంగా చాలా మంది ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ మేరకు ప్రజల ఆహార, విహారాల్లో మార్పులు చేసుకునేలా సూచనలు చేయాలి. క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలను చైతన్యపరచాలి. ఇది ఒక్క వైద్యులతోనే సాధ్యం అవుతుంది. ఒకవైపు వైద్యం చేస్తూనే మరోవైపు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి.

– డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు, కర్నూలు

ప్రభుత్వం వెంటనే వసతులు కల్పించాలి



రాష్ట్ర విభజన అనంతరం ఎక్కడో ఏర్పాటవుతుందనుకున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను కర్నూలులో ఏర్పాటైన ప్పుడు అందరూ సంతోషించారు. అయితే ఇది ప్రారంభమై 8 నెలలైనా ఇప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు కొనసాగకపోవడం బాధాకరం. ఇది పూర్తిస్థాయిలో సేవలు అందిస్తే రాయలసీమతో పాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్ర ప్రజలకు సైతం ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం క్యాన్సర్ ఎంతో ఖరీదైన జబ్బుగా మారింది. దీనికి చికిత్సను పేదలు, మధ్యతరగతి ప్రజలు భరించేస్థితిలో లేరు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని అన్ని వసతులు, సౌకర్యాలు, పరికరాలతో పూర్తిస్థాయిలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సేవలు అందించే ఏర్పాటు చేయాలి.

– ఎ. వెంకట్, మెడికల్ రెప్, కర్నూలు

వారం రోజుల్లో పరిహారం

- హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు కలెక్టర్ హామీ



యర్రగూడూరు గ్రామం వద్ద బాధిత రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జేసీ విష్ణుచరణ్

పాములపాడు: నేషనల్ హైవే 340 సి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికీ వారం రోజుల్లో పరిహారం అందేలా చూస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని యర్రగూడూరు, పాములపాడు, రుద్రవరం, క్రిష్టారావుపేట గ్రామాల్లో జేసీ విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ పర్యటించారు. రహదారి నిర్మాణ పనులు పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మండలంలో 1.98 కిలోమీటర్ల మేర రోడ్డుకు భూ సమస్య ఉందని, రహదారి నిర్మాణానికి ప్రజలు సహకరించడం లేదని నేషనల్ హైవే పీడీ కలెక్టర్‌కు తెలిపారు. పాములపాడు గ్రామంలోని సర్వే నెంబరు 62లో 0.38 సెంట్లకు గాను 1.11 ఎకరాలు స్థలం సేకరించారని స్థల యజమాని శ్రీనివాసరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ అలైన్‌మెంట్ ప్రకారం తీసుకొని మిగతాది రైతుకు అప్పగించాలని హైవే అధికారులను ఆదేశించారు. ముర్తుజావలి, సుధాకర్ తదితర రైతులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోతున్న వారికి తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2025 అక్టోబర్ నాటికి రహదారి నిర్మాణ పనులు పూర్తి కావాలని, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ బాలాజీ నాయక్, డీటీ పఠాన్‌బాబు, ఆర్ఐ ఖాజాబీ తదితరులు ఉన్నారు.

భూసేకరణ పూర్తి చేయండి

నంద్యాల: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలకు సంబంధించిన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై మంగళవారం ఆమె తన చాంబర్‌లో జేసీ విష్ణు చరణ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 340సి ప్యాకేజీ 4 కింద నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు మండలాలు మీదుగా వెళ్లే రహదారికి సంబంధించిన భూసేకరణకు 39 ఎకరాలకు సంబంధించిన క్లెయిమ్స్ సంబంధిత మండల తహసీల్దార్ల నుంచి తెప్పించుకొని నిశితంగా పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీఓలకు సూచించారు. 167కే ఒకటోప్యాకేజీ కింద (నంద్యాల నుంచిజమ్మలమడుగు వరకు) నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల మీదుగా వెళ్లే రహదారికి సంబంధించిన క్లెయిమ్స్ తెప్పించుకొని భూమిరాశి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 167కే ప్యాకేజీ 4 కింద కొత్తపల్లె–ఆత్మకూరు, ఆత్మకూరు– వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల మండలాల్లో పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ కూడా పాసయ్యాయని తెలిపారు. గుంటూరు – గుంతకల్ డబల్ రైల్వే లైనింగ్ పనులకు సంబంధించిన భూసేకరణను వెంటనే పూర్తి చేసి పంపాలన్నారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్ రావు
- రూ. 4, 66, 642 రికవరీకి ఆదేశం

మిడుతూరు: ఉపాధి హామీ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జనార్దన్ రావు హెచ్చరించారు. మిడుతూరు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద దాదాపు రూ.7 కోట్ల విలువ చేసే పనులు చేపట్టగా రూ. 26 లక్షలు అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ సభ్యులు వెల్లడించారు. చెరుకుచెర్ల, మిడుతూరు గ్రామ పంచాయతీల పరిధిలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగంతో పాటు కూలీలు లేకుండానే మస్టర్‌లో హాజరు నమోదు చేసినట్లు తేలిందన్నారు. అయితే, దుర్వినియోగం రూ. 26 లక్షలు జరిగితే డ్వామా అధికారులు రూ. 4, 66, 642 కు మాత్రమే రికవరీకి ఆదేశించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో చెరుకుచెర్ల ఫీల్డ్ అసిస్టెంట్‌పై డ్వామా పీడీ జనార్దన్ రావు విచారణకు ఆదేశించారు. నిబంధనల ప్రకారం 70 శాతం పనులు ఉపాధి కూలీలతో చేపడతామని, 30 శాతం రోలింగ్ చేయడానికి అవకాశం ఉన్నట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దశరథరామయ్య, నంద్యాల డివిజన్ ఏపీడీ బాలజీ నాయక్, అసిస్టెంట్ డీవీఓ షీబారాణి, ఏపీఓ జయంతి, క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాద్రి, ఎస్ఆర్‌పీ మురాద్, , డీఆర్‌పీలు పాల్గొన్నారు.

‘స్వర్ణరథం’పై ఆదిదంపతులు



శ్రీశైల ఆలయ మాఢవీథిలో కనుల పండువగా స్వర్ణరథోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లు స్వర్ణరథంపై ఊరేగారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఈ కార్యక్రమం నిర్వహించింది. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం , విశేషపూజలు అర్చకస్వాములు జరిపించారు. స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం ముందుభాగం నుంచి ఆలయ నాలుగు మాఢవీధుల గుండా ఈ కార్యక్రమం సాగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేశారు. స్వర్ణ రథోత్సవంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డి, అర్చకస్వాములు, వేదపండితులు, పలు విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది, శివసేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వర్ణరథోత్సవ కార్యక్రమ పూజల్లో దేవస్థాన ఈఓ చంద్రశేఖర ఆజాద్, అర్చకులు, అధికారులు

న్యాయ సంస్థల తరలింపును అడ్డుకుంటాం

- కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకుల హెచ్చరిక
- తరలింపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేత



బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): ‘గత ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి కోసం కర్నూలులో న్యాయ సంస్థలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు వాటిని అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. దీనిని తాము ప్రజలతో కలిసి అడ్డుకుంటా’మని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అసెంబ్లీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి అన్నారు. ఈ అంశంపై మంగళవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు రావినూతన దుర్గాప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నాయకులు మాట్లాడుతూ లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ తదితర సంస్థలను అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని కోస్తాలో ఉంటే హైకోర్టు రాయలసీమలో ఉండాలన్నారు. ఇది ఈ ప్రాంత ప్రజల హక్కు అన్నారు. ఇందులో భాగంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, ఎయిమ్స్, ట్రిపుల్ ఐటీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్, విద్యుత్ రెగ్యులేటరీ తదితర న్యాయ సంబంధ సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పుడు ఈ సంస్థలను చంద్రబాబు తరలించాలని చూడటం సరికాదన్నారు. ఆయనకు రాయలసీమ ప్రగతిపై చిత్తశుద్ధి ఉంటే కర్నూలులో ప్రిన్సిపల్ హైకోర్టు ఏర్పాటు , నేషనల్ లా యూనివర్సిటీలో తరగతులు, గ్రామ న్యాయలయాలను వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే కర్నూలు న్యాయ రాజధానిని వ్యతిరేకిస్తూ హైకోర్టులో వేసిన అన్ని పిటిషన్లను వెంటనే ఉపసంహరింపజేయాలన్నారు. ఇలా చేయకుండా ఉన్న వాటిని కూడా తరలిస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకోని న్యాయ సంస్థల తరలింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు ముక్కెర కృష్ణారెడ్డి, తిరుపతి, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, రాఘవేంద్ర, అంబేడ్కర్, ద్వారకానాథ్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

ఎమ్మిగనూరు రూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పొడిగించారు. ఇంతకు మునుపు ఈనెల 19 వరకు దరఖాస్తుకు గడువు ఇచ్చారు. ఇప్పుడు దీనిని ఈనెల 26 వరకు పొడిగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 ఫిబ్రవరి 8వ తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందని వెల్లడించారు. 9వ తరగతి విద్యార్థులు https://navodaya.gov.in వెబ్ సైట్లో, 11వ తరగతి విద్యార్థులు https:// cbseitms. nic. in/2023 వెబ్ సైట్లో గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.